# కుయ్...కుయ్... ఎస్.ఎమ్.ఎస్

-కె.వి.సుమలత

"దిసీజ్ ద రిథమ్ ఆఫ్ ద లైఫ్..లైఫ్" అంటూ ఫాస్ట్‌బీట్ సాంగ్‌ని కర్ణాటక రాగంలో మిక్స్ చేసి పాడుతున్న భాగ్యలక్ష్మి పాటను వింటూ చెప్పుల స్టాండులో చెప్పులు పెట్టి పాట వినవస్తున్న దిశగా అడుగులు వేసాడు రాజారావు.

"ఏమిటోయ్ అంత హుషారుగా వున్నావు?" అంటూ ఘుమాయిస్తున్న సేమ్యా పాయసం వాసనను గట్టిగా పీల్చుకుంటూ గుటకలు మింగసాగాడు.

"మంచి వార్తే మరి. అందుకే ఇంటికి తొందరగా వచ్చేసాను. స్వీటుతో మీకు శుభవార్త చెబుదామని ఆశ..."

"తొందరగా పెట్టు మరి" అంటూ సేమ్యా వంకే చూస్తున్న రాజారావు ధ్యాసంతా సేమ్యా మీదే వుందని గ్రహించి గిన్నెలో పోసి స్పూనువేసి చేతికిచ్చింది భాగ్యలక్ష్మి.

గబగబా నాలుగు స్పూనులు తిని "పాయసం చేయడంలో నీకు నువ్వే సాటి భాగ్యం" అన్నాడు. అందంగా సిగ్గుపడుతూ మురిసిపోయింది భాగ్యం ఉరఫ్ భాగ్యలక్ష్మి.

'సరే ఇప్పుడు చెప్పు ఏదో గుడ్‌న్యూస్ చెప్తానన్నావ్."

"ఈరోజు మధ్యాహ్నం నా సెల్‌కి ఒక మెసేజ్ వచ్చిందండీ. చూడగానే చాలా సంతోషం వేసింది. నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. సందేహ నివృత్తి కోసం నా బెస్ట్ ఫ్రెండ్ అదే ఇంగ్లీషు టీచర్ నళిని దగ్గరకు వెళ్లాను. తను చదివి నాకన్నా ఎక్కువగా సంతోషించింది."

"ఇంతకీ నీ సెల్‌కి వచ్చిన మెసేజ్ ఏమిటి?"

"అక్కడికే వస్తున్నాను ఉండండి" అంటూ సెల్ తీసుకొచ్చి మెసేజ్ చూపించింది.

"కంగ్రాచ్యులేషన్స్! 9247320300 నెంబర్ గల మీరు 3990 డాలర్ల బహుమతి గెలుచుకున్నారు. లక్కీ నెంబర్ల డ్రాలో మీరు సెలెక్ట్ అయ్యారు. వివరాలు తెలుసుకోవాలనుకుంటే 001-5852419866ను సంప్రదించండి"

"ఏమిటిది? లక్కీ నెంబర్‌గా సెలెక్ట్ అవడమేమిటి? ఏదైనా స్కీంలో చేరావా?" అన్నాడు.

"అదే ముందు నాకు అర్థం కాలేదు కానీ మా ఇంగ్లీషు టీచరు ఏమందంటే 'టీవీలో అవాక్క య్యారా ప్రోగ్రామ్‌లో సుమ తనకు వచ్చిన నెంబర్లలో ఒక నెంబర్‌ను లక్కీ నెంబర్‌గా సెలెక్ట్ చేసి కాల్ చేస్తుందికదా. అలాగే ఇండియాలోని ఫోన్ నెంబర్లలో కొన్ని నెంబర్లు సెలెక్ట్ చేసి ఉంటారు. అందులో మీదీ ఒకటి' అందండీ"

"అంటే 3990 డాలర్లు అంటే సుమారుగా లక్షన్నర రూపాయలదాకా వస్తుందా మనకు?"

"ఇప్పుడు అమెరికాలో ఆర్థిక మాంద్యంతో డాలర్ విలువ పడిపోయింది కదండీ" పెద్ద సత్యం తెలియజేస్తున్న ఫీలింగ్‌తో అంది భాగ్యం.

"అదేలే... అటూ ఇటుగా వస్తుందనుకో. ఇంతకీ ఇది నిజమేనంటావా భాగ్యం" అన్నాడు.

"నాకయితే నిజమేననిపిస్తోంది. వారం క్రితమే కదా అష్టలక్ష్మి వ్రతం చేసాను. లక్ష్మీదేవి కరుణించే వుంటుంది"

సదరు రాజారావు, భాగ్యలక్ష్మి ఇద్దరూ టీచర్లే. కాస్తంత అమాయకత్వం అధిక మోతాదులో మంచితనం కలగలసిన దంపతులు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. ముగ్గురినీ సిటీలో హాస్టల్స్‌లో ఉంచి చదివిస్తున్నారు. ఇద్దరి జీతాలు పిల్లల చదువులకు, వారి ఖర్చులకు బొటాబొటీగా సరిపోతాయి. ఏనాటికైనా తమకు ఇంకా ఎక్కువ మంచి పనులు చేయగలిగేలా దేవుడు చూస్తాడని ఎదురు చూస్తుంటారు.

"ఈ విషయం పిల్లలు ముగ్గురికీ ఫోన్ చేసి చెప్పమంటావా భాగ్యం?" రాజారావు అన్నాడు.

"ఇప్పుడు వద్దులెండి. డబ్బులు వచ్చాక మంచి గిఫ్టులు కొని చెబుదాము."

"సరే అలాగే చేద్దాం. ఈ సంగతి మా హెచ్ ఎమ్‌గారికి చెప్పనా?"

"అరె... ఎవరికీ చెప్పొద్దంది మా ఇంగ్లీషు టీచరు. మళ్లీ వాళ్లే ఇది మా నెంబరు అని ఫోన్ చేసి డబ్బులు తీసుకుంటారేమోనని చెప్పింది."

"అవునవును నిజమేనోయ్. మరి ఇప్పుడేం చేద్దాం. నాకు టెన్షన్‌గా ఉంది."

"టెన్షన్ పడకుండా ఇక్కడున్న నెంబర్‌కి ఫోన్ చేద్దాం. వాళ్లేం చెప్తారో చూద్దాం. ఏమంటారు?"

"మా భాగ్యం అన్నీ మంచి మాటలే చెప్తుంది. అసలిది ఏ వూరో ముందు తెలుసుకుందాం. డైరీ పట్రా" అన్నాడు రాజారావు.

ఇద్దరూ కలసి ఆ కోడ్ ఎక్కడిదో వెతికారు.

"ఇది బ్రిటన్ కోడ్. మనకు అక్కడి నుండి మెసేజ్ వచ్చింది. ఎవరో ఆకతాయి వాళ్లు పంపింది కాదు. ముగ్గురు ఆడపిల్లలున్నారు ఉడత రాముని కృపకు పాత్రురాలయినట్లు మనం కూడా దేవుడి దయకు నోచుకున్నాము" రాజారావు కళ్లు మూసుకుంటూ అన్నాడు.

"అవునండీ" అంటూ చెంపలు రెండూ ఒకేసారి కొట్టుకుని కళ్లు మూసుకుని చేతులు జోడించింది.

"సరే ఇక ఫోన్ చేద్దామా' అన్నాడు రాజారావు సంసిద్ధుడవుతూ.

"ఉండండి" అంటూ పసుపు కుంకుమల గిన్నె దేవుడి దగ్గర నుండి తెచ్చి ఫోన్‌కు పెట్టింది.

ఇద్దరూ భక్తిగా మరోసారి దేవుడని తలచుకుని ఫోన్‌కు నమస్కరించారు. చేతులు వణుకుతుండగా ఫోన్ నెంబర్లు రాజారావు డయల్ చేసాడు. రింగ్ అవకముందే వేగంగా ఫోన్ కట్ చేసి భాగ్యం వైపు తిరిగి "నువ్వే చేయి భాగ్యం. మళ్లీ నేను నీ భర్తనంటే నమ్మరేమో" అన్నాడు సీరియస్‌గా.

"అదేంటండీ అంత మాటన్నారు?"అంటూ మంగళసూత్రాలు తీసి కళ్లకద్దుకుంది భాగ్యం.

ఫోన్ పట్టుకుని "నాకు ఇంగ్లీషులో మాట్లాడటం రాదు కదండీ. బ్రిటన్ అంటే అంతా తెల్ల దొరలే కదా ఉండేది. ఎలా మాట్లాడను" అంది భాగ్యం దిగులుగా.

"పిచ్చిదానా! నాకు మాత్రం వచ్చా? నువ్వు భాగ్యలక్ష్మి అని చెప్పి నాకు ఇవ్వు. నేను ఎలాగో మేనేజ్ చేస్తాను" అన్నాడు రాజారావు ధీమాగా.

ఫోన్ చేసింది భాగ్యం. రింగవగానే చెవులు రిక్కించింది భాగ్యం. భాగ్యం చెంపకు తలానించి రాజారావు కూడా వింటున్నాడు.

"హలో విలియమ్స్ స్పీకింగ్" అంటూ ఇంగ్లీషులో వినిపించింది. సరిగ్గా అర్థం కాక "ఐయామ్ భాగ్యం. కాదు భాగ్యలక్ష్మి" అంది.

"వాడ్డూయూ వాంట్ బాగియలకిసిమి" అన్నాడతను.

"9247320300 మై సెల్ నెంబర్. యువర్ మెసేజ్ కమింగ్ విలియమ్స్‌గారూ" అంది ఒక్కో మాటను కూడబలుక్కుంటూ భాగ్యం.

"లక్కీ నెంబర్? ఓ ఐసీ... యువర్ నెంబర్ ఈజ్ లక్కీ నెంబర్ భాగియలక్‌సిమి" అన్నాడు. ఫోన్ కట్ అయింది.


"అయ్యో ఫోన్ కట్ అయిందేమిటి?" కంగారుగా అంది భాగ్యం.

అంతకన్నా కంగారుగా ఫోన్ లాక్కుని చూసాడు రాజారావు.

"బ్యాలెన్స్ అయిపోయిందోయ్. నిన్నే కదా 200 రిఛార్జ్ చేయించావు. బ్రిటన్ కదా అయిపోయింది. ఇప్పుడెలా? నా సెల్‌లో నుండి మాట్లాడు. ముందు నువ్వు మాట్లాడి నేను హస్బెండ్‌నని చెప్పు" అన్నాడు.

మళ్లీ విలియమ్సే ఫోన్ తీసాడు.

"ఐయామ్ భాగ్యలక్ష్మి విలియమ్స్‌గారూ. మై హస్బెండ్ రాజారావు స్పీకింగ్ దిస్ నెంబర్ ఈజ్ మై హస్బెండ్ రాజారావు సెల్" అంది తెలుగు



మీడియం చదివిన భాగ్యం.

"ఓకే...ఓకే భాగియలకిసిమి కెన్ ఐ స్పీక్ టు రాజారావ్" అన్నాడు.

"ఐయామ్ రాజారావ్. హస్బెండ్ ఆఫ్ భాగ్యలక్ష్మి. ఐయామ్ ది టీచర్ ఆఫ్ అప్పర్ ప్రైమరీ స్కూల్" అన్నాడు రాజారావు చిన్నపిల్లవాడు ఎక్కం అప్పజెప్పినట్లు.

"గ్లాడ్ టు మీట్ యూ రాజారావ్. యు ఆర్ వెరీ లక్కీ ఫెలో. యువర్ వైఫ్ గాట్ 3990 డాలర్స్. మై కొలీగ్ విల్ స్పీక్ తెలుగు. స్పీక్ విత్ మై కొలీగ్ జేమ్స్" అంటూ ఉండగానే రాజారావు ఫోన్ కూడా కట్ అయింది.

"ఇది ల్యాండ్‌లైన్ ఫోన్ అనుకుంటా. నా ఫోన్‌లో కూడా బ్యాలెన్స్ అయిపోయింది. ఇప్పుడేమిటి చేయడం?" అని తల పట్టుకున్నాడు రాజారావు.

"ఏముందీ? బ్యాలెన్స్ వేయించుకోవడంతప్ప వేరే దారిలేదు" అంది భాగ్యం.బయటకు వెళ్లిన రాజారావు మరో గంటలో రెండు ఫోన్లలో వెయ్యి రూపాయల బ్యాలెన్స్‌తో తిరిగివచ్చాడు. ఇద్దరూ కూర్చుని కాల్ చేసారు.


## లేడీ పోర్టర్లు

రైల్వే స్టేషన్లలో పోర్టర్లంతా మగవాళ్ళేననుకుంటాం. ఎందుకంటే వాళ్ళు బోల్డంత బరువులు మోయగలరు కనుక. కానీ, గుజరాత్‌లోని భావనగర్ స్టేషన్లో గత 69 ఏళ్ళుగా లేడీ పోర్టర్లు కూడా పని చేస్తున్నారుట. ఇటీవల అలహాబాదు స్టేషనులో పోర్టర్ల ఉద్యోగాలకు దరఖాస్తులడిగితే 25 మంది స్త్రీలు అప్లయి చేశారుట. వారిలో 19 మందిని రైల్వేవారు సెలక్టు చేసారుట. ఆడవాళ్ళు పని చేయటంలో ఏమీ తప్పులేదంటారు కిరణ్ బేడీ. ఇంతకాలంగా ఆడవాళ్ళు అప్లయి చేయలేదు కనుక ఇవ్వలేదు కాని- ఆ ఉద్యోగాలు ఇవ్వటానికి తమకేం అభ్యంతరాలు లేవంటున్నారు రైల్వేవారు. అయితే తలమీద బరువులు మోసే దానికి బదులు వారికి ట్రాలీలను ఇవ్వటానికి రైల్వేవారు సిద్ధపడుతున్నారు.

## మిరకిల్

దక్షిణ ఫిలిప్పీన్స్‌లో జాంబూంగా ద్వీపకల్ప తీరంలోని సముద్రంలో అనేక సొర చేపలు ఉండే చోట ఇటీవల 968 మంది ప్రయాణికులతో వెళుతున్న ఓడ మునిగిపోయిందిట. 39 సంవత్సరాల మహిళ రెస్క్యూ టీమ్ వారొచ్చి కాపాడేదాకా ఆ నీళ్లల్లో 30 గంటలసేపు లైఫ్‌బోట్‌లో గడిపిందిట.

-తటవర్తి




"ఐయామ్ రాజారావు హస్బెండ్ ఆఫ్ భాగ్యలక్ష్మి" అంటూ జేమ్స్‌కి పరిచయం చేసుకున్నాడు రాజారావు.

"నైస్ టు మీట్ యూ రాజారావు. బ్రిటన్‌లోనే అతి పెద్ద సంస్థ మాది. ఇండియాలోని కొన్ని ఫోన్ నెంబర్లు సెలెక్ట్ చేసి ప్రైజ్ మనీ ఇస్తుంది. ఇలా ఇవ్వాలనుకోవడంలో మా సంస్థ పేరు ప్రఖ్యాతులు పెరగడం అనే సదుద్దేశ్యం తప్ప ఎటువంటి మోసంలేదు. లక్కీగా మీ ఫోన్ నెంబర్ రావడం మీ అదృష్టం. వచ్చే సోమవారం సాయంత్రం ఆరుగంటలకు మేము ఎవరెవరిని సెలక్ట్ చేసామో మీకు ఇంటర్‌నెట్ ద్వారా తెలియజేస్తాము. వన్స్ ఎగైన్ కంగ్రాట్స్ రాజారావ్" అంటూ ఫోన్ కట్ చేసాడు జేమ్స్.

***

వారంరోజులు అతి వేగంగా గడిచిపోయాయి వాళ్లిద్దరికీ. సోమవారం సాయంత్రం దగ్గరలో వున్న ఇంటర్‌నెట్ సెంటర్‌కి వెళ్లారు. ఆరుగంటలకు భాగ్యలక్ష్మి పేరుతో బహుమతి పత్రాన్ని పంపించారు. అది చూసిన రాజారావు, భాగ్యలక్ష్మి ముఖాలు వెయ్యి క్యాండిల్స్ బల్బులకన్నా ఎక్కువ ప్రకాశవంతంగా వెలిగిపోయాయి. దారిలో ఏమీ మాట్లాడుకోకుండానే ఇంటికి తిరిగివచ్చారు.ఆ రాత్రి భాగ్యం రాజారావుతో అంది "ఏమండీ! మీరు ఏమీ అనుకోనంటే చిన్నమాట" అంది మళ్లీ సిగ్గుపడుతూ.

"చెప్పు భాగ్యం" అన్నాడు రాజారావు.

"ఈమధ్య మా ఇంగ్లీషు టీచర్ అదేనండీ నళినీలేదూ... తను పెద్ద లాంగ్ చైన్ చేయించుకుంది. యాభై వేలు అయిందిట. మామూలుగా అయితే నేనూ అడిగేదాన్నికాదు. ఇప్పుడు అనుకోకుండా వచ్చిన లక్ష్మీదేవితో నా కోరిక తీర్చుకోవాలని ఉంది." అంది మురిపెంగా.

"దానికే అంత సిగ్గెందుకు భాగ్యం. యాభై పోయినా లక్ష మనకు మిగులుతాయి కదా. నీ కోరిక తీరినట్టే" అభయహస్తం ఇచ్చాడు.

***

మరుసటిరోజు భాగ్యంకు ఫోన్ చేసి "మీకు డాలర్లు పంపడానికి మీ అడ్రస్ కావాలి మేడమ్" అని జేమ్స్ అడిగాడు.

భాగ్యం తమ ఇంటి అడ్రస్ వివరంగా చెప్పింది. జరిగినదంతా రాజారావుకి కూడా ఫోన్ చేసి చెప్పింది భాగ్యం. ఫోన్ రింగయితే చాలు వాళ్లిద్దరి దృష్టి దానిమీదే ఉండేది. నాలుగురోజులు వారికి ఎటువంటి ఫోన్ రాలేదు. టెన్షన్‌తో వాళ్లిద్దరికీ మతి పోతున్నట్లు అనిపించింది.

"భాగ్యం! వాళ్లు మన అడ్రస్ కనుక్కోవడం కష్టమనిపించి వద్దనుకుంటారేమో?" అన్నడు రాజారావు.

"నాకూ అదే అనుమానంగా ఉందండీ. అవసరం మనది కదా. మనమే ఫోన్ చేద్దామా?" అంది భాగ్యం. అంతలో భాగ్యం ఫోన్ రింగయింది.

"ఏమండీ! బ్రిటన్ నుండి కాల్ వచ్చింది. మన మాటలు దేవుడు వాళ్లకు వినిపించి ఉంటాడు"

"అవునవును" అంటూ ఫోన్ ఆన్ చేసాడు రాజారావు.

"రాజారావుగారూ! మీ బహుమానాన్ని మీ అడ్రస్ ప్రకారం కొరియర్‌లో పంపడానికి అంతా రెడీ చేసాము. అయితే కస్టమ్స్ సుంకం కింద మీరు కొంత డబ్బు చెల్లించవలసి ఉంటుంది. మరి మీరు సిద్ధమేనా?" అన్నాడు.

"అదేంటండీ డబ్బులేంటి? బహుమతి ఇస్తానంది మీరు కదా" రాజారావు లా పాయింట్ తీస్తున్నవాడిలా ఫోజ్ పెట్టాడు.

"మేము మీకు ఇచ్చే ప్రైజ్ మనీ 1,53,957 రూపాయలు. మీరు కస్టమ్స్‌కి చెల్లించవలసింది కేవలం ముప్పైవేలు మాత్రమే. మీరు ఏ విధంగానూ నష్టపోవడంలేదు. ఆలోచించండి" అన్నాడు జేమ్స్.

"వచ్చినట్లే వచ్చి డబ్బులు మనల్ని దూరం నుండే మురిపిస్తున్నాయేం టండీ" అంటోంది భాగ్యం గంటకోసారి రాజారావుతో.

"అదే ఆలోచిస్తున్నాను భాగ్యం. వాళ్లు మోసం చేస్తున్నట్లుగా అనిపించ డంలేదు. మంచివాళ్లలాగే ఉన్నారు. ఇంటర్‌నెట్‌లో వాళ్ల వివరాలు చూస్తుంటే వాళ్లు చెప్పేది నిజమనిపిస్తోందోయ్" అన్నాడు రాజారావు.

***

రెండురోజుల తరువాత ఉదయమే జేమ్స్ ఫోన్‌తో రాజారావు, భాగ్యం నిద్ర లేచారు. "బ్రిటన్ నుండి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో దిగాను. మీరు నన్ను నమ్మి మా అకౌంట్‌లో డబ్బులు వేయడంలేదు. మా కంపెనీ పనిమీద హైదరాబాద్ వస్తున్నాను. అలాగే మీ డబ్బు మీకు అందించాలని మా కంపెనీ డైరెక్టర్స్ నన్ను ఆదేశించారు" అన్నాడు జేమ్స్.

"చాలా థాంక్సండీ జేమ్స్‌గారూ. హైదరాబాద్ ఎప్పుడు వస్తారు?" చాటంత అయిన ముఖంతో రాజారావు అడిగాడు.

"మధ్యాహ్నంకల్లా హైదరాబాద్ వస్తాను. సాయంత్రం మీ ఇంటికి వస్తాను. మీ ఇంటి అడ్రస్ వివరంగా చెప్పండి."

రాజారావుకు కాళ్లు నేలమీద ఆనడంలేదు ఆ మాట వినగానే. ఒకటికి నాలుగుసార్లు ఇంటి అడ్రస్ చెప్పాడు జేమ్స్‌కి. ఫోన్ పెట్టేసాక భాగ్యంతో జేమ్స్ చెప్పినదంతా చెప్పాడు. భాగ్యం ఆనందం సంగతి చెప్పనక్కర్లేదు.

ఇద్దరూ స్కూల్‌కు సెలవు పెట్టేసారు. భారీ ఎత్తున వంట ప్రయత్నాలు చేయబోయిన భాగ్యంను వారించాడు రాజారావు.

"వాళ్లు ఇంగ్లీషువాళ్లు. మన వంట తినరు" అని చెప్పాడు.

బయట నుండి పిజ్జా, బర్గర్‌లు తెచ్చాడు. ఎప్పుడు సాయంత్రం అవు తుందా అని మాటిమాటికీ గడియారంవంక చూస్తున్నారు. అంతలో మళ్లీ జేమ్స్ ఫోన్ చేసాడు.

"రాజారావుగారూ! నా పాస్‌పోర్టు పోయింది. నేను హైదరాబాద్ రాలేక పోతున్నాను. తిరిగి పాస్‌పోర్టు నేను తీసుకునేసరికి మూడురోజుల సమయం పడుతుంది. కాబట్టి మీ డబ్బు కొరియర్ చేస్తాను. కస్టమ్స్ చార్జీలు మీకు తగ్గుతాయి కనుక పదిహేనువేలు మా అకౌంట్‌లో వేయండి. మీకు నమ్మకం కుదరకపోతే మా వెబ్‌సైట్‌లో నా పాస్‌పోర్ట్ ఉంటుంది. చూడండి" అని చెప్పాడు.

రాజారావు ఇంటర్‌నెట్‌లో జేమ్స్ పాస్‌పోర్టును చూసాడు.

"ఇంత నమ్మకంగా ఆధారాలు ఉండగా మనం నమ్మకపోతే మన కోసం వచ్చిన లక్ష్మీదేవి వెనక్కి వెళ్లిపోతుందేమోనండీ" అంది భాగ్యం.

"నాకూ అలాగే అనిపిస్తోందోయ్. వేసేద్దామా" అన్నాడు సాలోచనగా.

"లక్షన్నరలో పదిహేనువేలు పోతాయి. అంతేకదా వేయండి. ఒకవేళ మనల్ని మోసంచేస్తే బ్యాంక్‌లో అకౌంట్ నెంబర్ ఉందిగా. అలాగే ఇంటర్ నెట్ వాళ్ల పేరుతో వెబ్‌సైట్ కూడా ఉంది. వాళ్లు ఎక్కడికి పోతారు?" అంది ధీమాగా. ఇద్దరూ కూడబలుక్కుని ఎట్టకేలకు పదిహేనువేలు బ్యాంకులో వేసారు. ఆ సంగతి జేమ్స్ ఫోన్ చేయగానే ఆనందంగా చెప్పారతనికి.

"మీరు నిశ్చింతగా ఉండండి. 3990 డాలర్లు ఇక మీ స్వంతమే" అన్నాడు జేమ్స్. ఆ రాత్రి భాగ్యం, రాజారావులు నిద్రపోకుండా ఆ డబ్బును ఎలా ఖర్చు పెట్టాలో రకరకాల ప్లాన్లు వేసుకున్నారు.

***

తెల్లవారింది. కళ్లు నలుముకుంటూ గేటు దగ్గర వేసిన పేపర్ తీసుకుని లోపలికొస్తున్న భాగ్యం దృష్టి పేపర్ ఫ్రంట్ పేజీలోని మెయిన్ హెడ్డింగ్‌మీద పడింది.

"ఇంటర్‌నెట్‌లో దోపిడీల వల" ఇదేదో వింతగా ఉందేమిటి చెప్మా అను కుంటూ అక్కడే నిలబడి చదివింది.

అంతే! గుండెలు బాదుకుంటూ వెళ్లి రాజారావును నిద్ర లేపింది.

"ఏమయింది భాగ్యం? ఎందుకలా కంగారు పడుతున్నావు?" అంటూ లేచి కూర్చున్నాడు. భాగ్యం పేపర్‌లోని మేటర్ అతనితో చదివించింది.

"విజయవాడ, చెన్నై, హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లోని విద్యావంతులే లాటరీల పేరుతో డాలర్లు వచ్చాయంటూ వచ్చిన మెసేజ్‌లకు అధిక సంఖ్యలో బలవుతున్నారు. ఇంటర్‌నెట్ చూపించే నగదు పత్రాలకు, ఐడెం టిటీలకు బలయిపోతున్నారు. పోలీసులు వీరి కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు."

"అయితే మన పదిహేనువేలు గోవిందా గోవిందా!" అని లబోదిబోమ న్నాడు రాజారావు.

★



## స్నేహం కోసం...

సల్మాన్ సోదరుడు నిర్మిస్తున్న 'మై అవుర్ మిసెస్ ఖన్నా'లో సల్మాన్-కరీనా హీరోహీరోయిన్లు. అయితే ఇందులో ఓ అతిథి పాత్రలో సొట్టబుగ్గల సుందరి ప్రీతీ జింతా నటిస్తోందిట. అలా నటించినందుకుగాను ఒక్క పైసా కూడా రెమ్యూనరేషన్ తీసుకోలేదట ప్రీతి. సల్మాన్ తనకి మంచి ఫ్రెండ్ అనీ, అలాంటి ఫ్రెండ్ దగ్గర గెస్ట్ రోల్ కోసం పారితోషికం తీసుకో వడం తనకి బొత్తిగా ఇష్టంలేదని అందుకనే ఫ్రీగానే నటించానని అంటోంది ప్రీతి.

